క్లుప్తంగా

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



చింతకాని పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఐఓ డాక్టర్ ప్రమీల

చింతకాని: గర్భిణులు, చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని డీఐఓ డాక్టర్ ప్రమీల వైద్యసిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగే విధంగా గర్భిణులను ప్రోత్సహించాలని తెలిపారు. ఎంసీహెచ్ కిట్, వ్యాధి నిరోధక టీకాల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వ్యాధి నిరోధక టీకాలు వందశాతం అమలు జరిగే విధంగా హెల్త్ సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బందికి తగు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్, సీహెచ్‌ఓ వీరేంద్ర, హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణారావు, రేఛల్‌రాణి, పండరీబాయి, ఏఎస్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

మధిర: మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మిరియాల రమణ గుప్తాను తెలంగాణా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క పరామర్శించారు. ఇటీవల రమణ గుప్తా మోకాళ్లకు శస్త్ర చికిత్స చేయించుకోవడంతో.. బుధవారం వారి గృహానికి వెళ్లి పరామర్శించి బాగోగులు కనుకున్నారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు ఉన్నారు.

ముగ్గుల పోటీలు



ముగ్గులపోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న దుర్గాప్రసాద్, ఎస్సై రవి

ఏన్కూరు: మండలంలోని భగవాన్ నాయక్ తండలో కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి గుగులోత్ సర్దార్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ దుర్గాప్రసాద్, ఎస్సై బాదావత్ రవి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు స్వర్ణ నరేందర్, వేముల కృష్ణప్రసాద్, భూక్యా కిషన్ నాయక్, మాళోత్ నర్సింహారావు, గుగులోత్ రమణ, గుగులోత్ బాల, రాజారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాగమయికి ఆహ్వానం



ఎమ్మెల్యే మట్టా రాగమయికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ కవిత

సత్తుపల్లి: ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కుమారుడు రాజారెడ్డి వివాహానికి రావాలని ఖమ్మం జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గడిపల్లి కవిత బుధవారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయికి పెళ్లిపత్రికను అందించి ఆహ్వానించారు. ఫిబ్రవరి 17న రాజస్థాన్‌లో ఈ వివాహం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ వెంకటేశ్వరరావు, శ్రీరాముల వెంకటేశ్వర్లు, జానకి, రామాచారి పాల్గొన్నారు.

వీరయ్య ఆశయసాధనకు కృషి చేయాలి



గోకినేపల్లిలో మచ్చా వీరయ్య సంస్మరణ సభలో నాయకులు, కుటుంబ సభ్యులు

ముదిగొండ: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మచ్చా వీరయ్య 75వ వర్థంతి గోకినేపల్లిలో బుధవారం నిర్వహించారు. మచ్చా వీరయ్య స్థూపానికి, ఆయన చిత్రపటానికి కుటుంబ సభ్యులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంస్మరణ సభ నిర్వహించారు. పలువురు నాయకులు, కుటుంబ సభ్యులు, నాయకులు మచ్చా విద్యాసాగర్, మచ్చా సూర్యనారాయణ, మచ్చా లక్ష్మి, వాసిరెడ్డి వరప్రసాద్, అనీల్, ప్రగతి, క్రాంతి, విజయ, శ్రీలత, వెంకన్న, రవిలు పాల్గొన్నారు.



బహిరంగ ప్రదేశంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్లాస్టిక్ నియంత్రణ గాలికేనా..!

- యథేచ్ఛగా కవర్ల వినియోగం
- పర్యావరణానికి పెను ముప్పు
- భవిష్యత్ తరాలకు తప్పని పాట్లు
- నిషేధించడంలో అధికారుల వైఫల్యం

ప్లాస్టిక్ మన నిత్య జీవితంలో భాగమైపోయింది. బకెట్లు, డబ్బాలు, సంచులు.. ఇలా ఇంట్లో ఏ మూల చూసినా కచ్చితంగా ఎదో ఒక రూపంలో ప్లాస్టిక్ కనిపిస్తూనే ఉంటుంది. అయితే ప్లాస్టిక్ వస్తువుల కన్నా ప్లాస్టిక్ సంచుల వాడకమే ఎక్కువ ప్రమాదం. పలుచగా ఉండే ఈ ప్లాస్టిక్ సంచులను అతిగా వాడి ఎక్కడ పడితే అక్కడ పడేయడం, వీటిని రీసైకిల్ చేసే అవకాశం లేకపోవడం వల్ల భవిష్యత్తులో పెను ప్రమాదమే ఎదురవుతుందని పర్యావరణ హితులు భయపడుతున్నారు.

వైరారూరల్: ప్లాస్టిక్‌ను ప్రకృతికి సహజ సిద్ధంగా లభించే అణువులతో కాకుండా కృత్రిమ విధానం ద్వారా తయారు చేస్తారు. ఇది మానవ మానుగడకు తీవ్ర ఇక్కట్లను గురి చేస్తుంది. వాతావరణ కాలుష్యంతో పాటు పర్యావరణానికి ముప్పును తలపెడుతుంది. అంతేకాకుండా ప్లాస్టిక్ వస్తువును భూమిలో పాతిపెడితే 10 సంవత్సరాల తర్వాత కూడా అది యథాస్థానాన్ని కలిగి ఉంటుంది. ప్లాస్టిక్ వినియోగం వలన గుండె పెద్దది కావడం, కేన్సర్ వంటి ప్రాణంతక వ్యాధులు సోకుతాయని నిపుణులు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ వినియోగంపై దృష్టి సారించాల్సిన అధికారులు వారికి ఏమి పట్టనట్లు షాపు యాజమానులకు నామమాత్రపు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటూ కాలయాపన చేస్తున్నారు. దీంతో ప్లాస్టిక్ వినియోగం యథేచ్ఛగా సాగుతోంది.

నామమత్రంగా అధికారుల తనిఖీలు..

చిరువ్యాపారస్తుల నుంచి మొదలుకోని పెద్ద పెద్ద వ్యాపారాలు సాగించే ప్రతి దుకాణంలో ప్లాస్టిక్ విక్రయాలు జరుగుతున్నా.. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకుండా నామమాత్రపు తనిఖీలు చేసి సరిపెట్టుకుంటున్నారు. దీంతో పలు దుకాణదారులకు రెక్కలు వచ్చి పర్యావరణానికి ముప్పును తలపెట్టే ప్లాస్టిక్ కవర్లనే వినియోగిస్తూ ప్రజా ఆరోగ్యాలతో ఆడుకుంటున్నారని పలువురు బహిరంగానే చర్చించుకుంటున్నారు.

అంత ప్లాస్టిక్ మయమే..

ప్రతి దుకాణంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం యథేచ్ఛగా జరుగుతుంది. కూరగాయల నుంచి ఏ సరుకులను తీసుకున్న ప్లాస్టిక్ కవర్లలోనే విక్రయిస్తున్నారు. పలు దుకాణదారులు 50 మైక్రాన్ల లోపు ఉన్న ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్నారనే వాదనలు సర్వత్రా విన్పిస్తున్నాయి. దీంతో రోడ్లపై ఎటుచూసిన ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు దర్శనమిస్తూ వాతావరణాన్ని కాలుష్యం చేస్తున్నాయి.

- గతంలో అధికారులు ప్లాస్టిక్ కవర్ల వలన కలిగే నష్టాలపై దుకాణదారులకు, వినియోగదారులకు అవగాహన కల్పించినా ప్రయోజనం లేకుండా పోతుంది. పలు పల్లెల్లో మురుగు కాలువలు, పెంట దిబ్బలు, చెత్త కుప్పలలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఒక్క పల్లెలోనే కాకుండా వైరా పట్టణంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

ప్లాస్టిక్ నియంత్రణ అందరి బాధ్యత...

పర్యావరణానికి ముప్పుగా మారుతున్న ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కలిసి రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్లాస్టిక్ నియంత్రణకు స్వీయ నిర్ణయం కూడా ముఖ్యం. అధికారులు సూచించిన నిర్దేశిత ప్లాస్టిక్ కవర్లను వాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. అయితే విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లను వాడడం వలన మురుగు కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఇప్పటికైనా వినియోదారులతో పాటు అధికారులు ప్లాస్టిక్ కవర్లను నియంత్రించి ప్రజా ఆరోగ్యాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

అవగాహన కల్పించినా ఫలితం లేదు..



యథేచ్ఛగా సాగుతున్న ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతంలో ప్లాస్టిక్ వాడకం వలన కలిగే నష్టాలపై అధికారులు పలుమార్లు అవగాహన కల్పించినా ఫలితం లేకుండా పోయింది. చిరువ్యాపారస్తుల నుంచి మొదలు ప్రతి దుకాణంలో ఏం కొనుగోలు చేసిన ప్లాస్టిక్ కవర్లనే ఇస్తున్నారు. దీంతో పర్యావరణానికి ముప్పు కలిగే అవకాశం ఉంది.

– వేల్పుల సురేష్, బ్రహ్మణపల్లి, వైరా

అధికారులు చర్యలు తీసుకోవాలి..



ప్లాస్టిక్ వినియోగం పెరుగుతున్న నేపథ్యాన ప్రజలకు అవగాహన కల్పించి ప్లాస్టిక్ నియంత్రణకు దృష్టి సారించాలి. పల్లెలతో పాటు పట్టణ కేంద్రాల్లోని అన్ని రకాల దుకాణాలలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం పరిపాటి మారడంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అధికారులు ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించడంతో పాటు జరిమానా విధించాలి.

– ఐనాల రాజీవ్, కేజీ సిరిపురం

దరఖాస్తు చేసుకోండి

కారేపల్లి: కారేపల్లిలోని ఎస్ఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల భవన సముదాయంలో నిర్వహిస్తున్న తెలంగాణ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల (వైరా గరల్స్–1)లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.శైలజ తెలిపారు. ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6 వరకు ఆన్‌లైన్‌లో లేదా టీఎంఆర్ఈఐఎస్ మొబైల్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వ తరగతిలో 80 సీట్లకు గాను, మైనార్టీలకు 60 సీట్లు, ఇతరులకు 20 సీట్లు కేటాయించారు. మైనార్టీలు ముందు దరఖాస్తు చేసుకున్నవారికి ప్రాధాన్యత ఇచ్చి అడ్మిషన్ తీసుకొని, ఇతరులకు కేటాయించిన 20 సీట్లను లక్కీ డ్రా ద్వారా భర్తీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. 6, 7, 8వ తరగతుల్లో ఏర్పడిన ఖాళీలను ముందు దరఖాస్తు చేసుకున్న వారికి కేటాయిస్తారని, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఎంపీసీలో 40 సీట్లకు గాను, 30 సీట్లు మైనార్టీలకు, 10 సీట్లు ఇతరులకు, బైపీసీలో 40 సీట్లకు గాను, 30 సీట్లు మైనార్టీలకు, 10 సీట్లు ఇతరులకు కేటాయించగా, పదో తరగతిలో వచ్చిన మెరిట్ మార్కుల ఆధారంగా భర్తీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు

తల్లాడ: కేసీఆర్ పాలనలో తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేరలేదని, మిగులు బడ్జెట్‌తో ఏర్పడ్డ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి గంగదేవుల లోకేష్ యాదవ్ అన్నారు. బుధవారం తల్లాడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణాని రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసి ఒక్కో మనిషిపై రూ.2 లక్షల భారం మోపారని తెలిపారు. కేసీఆర్ పాలనలో అవినీతి బాగా జరిగిందని, లక్షల కోట్లు సంపాదించుకొని ప్రజలకు అన్యాయం చేసినట్లు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా ఆరు గ్యారంటీలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దగ్గుల నాగిరెడ్డి, నాయకులు గొడుగునూరి శ్రీనివాసరెడ్డి, పొన్నం కృష్ణయ్య, వాకదాని రామకృష్ణ, రాగం రమణ, రావుల గోపయ్య గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లోకేష్ యాదవ్

తిమ్మారావుపేటలో ఉచిత వైద్యశిబిరం

ఏన్కూరు: మండల పరిధిలోని తిమ్మారావుపేటలో ఎన్టీఆర్ వర్థంతి సందర్భంగా మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు కొనకంచి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం శ్రీ రక్ష హాస్పిటల్, పాల్వంచ ఎల్వీ పసాద్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు కళ్లజోళ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో సేవాభారతి జిల్లా అధ్యక్షుడు మోత్కురి నారాయణ, తిమ్మారావుపేట ఎంపీటీసీ లచ్చిరాం నాయక్ పాల్గొంటారు.

గుంతను పూడ్చిన పంచాయతీ సిబ్బంది

వైరారూరల్: మండలంలోని పాలడుగు గ్రామ రహదారి మీద మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకైన నేపథ్యాన సంబంధిత శాఖ అధికారులు మరమ్మతులు చేసి గుంతను పూడ్చకుండా వదిలేశారు.

దీంతో గ్రామస్తులు గుంతను పూడ్చాలని సంభందిత శాఖాధికారులకు తెలుపగా.. వారు ఆ బాధ్యత పంచాయతీ సిబ్బందిపై ఉందన్నారు. ఈ క్రమంలో కొద్దిరోజుల క్రితం గ్రామస్తులు నిరసన తెలుపడంతో పంచాయతీ సిబ్బంది గుంతను పూడ్చి సమస్యను పరిష్కరించారు.

కంకర తేలిన రోడ్డు

వైరా: వైరా రింగ్ రోడ్డు సెంటర్ వద్ద జాతీయ ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. నిత్యం ఇటుగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్న క్రమంలో రోడ్డు కుంగి కంకర తేలింది. దాంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. రోడ్డుపై కంకర తేలడం వలన నిత్యం వాహనాల టైర్లు భారీ శబ్దాలతో పేలిపోవడంతో స్థానికులు భయాందోళకు గురవుతున్నారు. ఇటీవల సత్తుపల్లి నుంచి మధిర వైపు వెళ్లే ఓ లారీ టైరు పేలడంతో 20 అడుగుల దూరంలో ఉన్న ఆటో మొబైల్ షాపులోకి రాళ్లు దూసుకెళ్లిన నేపథ్యాన ఆటో మొబైల్ షాపు ముందు ఏర్పాట్లు చేసిన ట్యూబ్ లైట్లు ధ్వంసమయ్యాయి. అలాగే లారీకి వెనుక భాగం నుండి వస్తున్న మరో డీసీఎం వ్యాన్ రాళ్లు తగలడంతో డ్రైవర్ ముందు అద్దాలు పగిలిపోయాయి. రాళ్లు ఎగసిపడిన తీరు ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఎగిసి పడిన రాళ్లు పాదచారులు, ద్విచక్ర వాహనదారుకు తగిలినట్‌లైతే ప్రమాదం చోటు చేసుకునేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై కంకర తేలిన దృశ్యం



టైరు పగిలిన లారీ (ఫైల్)

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ వితరణ



కుట్టుమిషన్, నగదు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: వైరా గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేద మహిళకు కుట్టుమిషన్, విద్యార్థిని చదువులకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. వైరా లయన్ డాక్టర్ కాపా లోహిత జన్మదినాన్ని పురస్కరించుకుని గొల్లపూడికి చెందిన ఉప్పు అనూష అనే నిరుపేద మహిళకు కుట్టుమిషన్, కొణిజర్ల మండల కేంద్రానికి చెందిన పందిళ్ల ఉషారాణి అనే విద్యార్థినికి రూ 5వేలు అందించిన సాయాన్ని లయన్స్‌క్లబ్ పీడీజీ డాక్టర్ కాపా మురళీ కృష్ణ చేతుల మీదుగా అందజేశారు. గ్రేటర్ విజన్ క్లబ్ అధ్యక్షురాలు ఉంద్రు వరలక్ష్మి, జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు, ఆర్‌సీ లగడపాటి ప్రభాకర్ రావు, గంగవరపు కిషన్, ఉయ్యూరి రామకృష్ణ, కె.గోపి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో హుండీ చోరీ

మధిర: మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామ సమీపంలో ఉన్న శివాలయంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు హుండీ తాళాలు పగలగొట్టి నగదు చోరీ చేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయాన్నే ఆలయంలోకి వచ్చిన పూజారి హుండీ తాళాలు పగిలి ఉండడంతో దొంగతనం జరిగిందని గ్రహించి వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించినట్లు వారు తెలిపారు. పోలీసులు ఇలాంటి అగంతకులను కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

శివాలయం, అంకమ్మతల్లి ఆలయాల్లో..



బనిగండ్లపాడులో పగలకొట్టిన హుండీలను పొలాల్లో వేసిన దృశ్యం

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో పక్క పక్కనే ఉన్న శివాలయం, అంకమ్మ తల్లి ఆలయాల్లో మంగళవారం రాత్రి చోరీలు జరిగాయి.

గుర్తు తెలియని వ్యక్తులు మూడు హుండీలను పగలకొట్టి అందులోని వేలాది రూపాయల నగదు చోరీ చేశారు. హుండీలను ఊరి బయట పంట పొలాల్లో పారేశారు. బుధవారం ఉదయం ఆలయాలకు వచ్చిన పూజారులు చోరీకి గురైన విషయం గమనించి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఎస్సై సురేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించండి

సత్తుపల్లిటౌన్: రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ పాటించి రహదారి ప్రమాదాల నివారణకు భాగస్వాములు కావాలని సత్తుపల్లి ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య అన్నారు. సత్తుపల్లి రవాణాశాఖ కార్యాలయంలో బుధవారం వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి రహదారి భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్రవాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేటప్పుడు సీటుబెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని తెలిపారు. అందరు సురక్షితంగా ప్రయాణం చేయటానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ టి.రమేష్, సిబ్బంది ఆర్.వంశీ, ఎం.పవన్, హోంగార్డులు కె.ప్రసాదరావు, జి.కృష్ణారావు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంవీఐ పుల్లయ్య, సిబ్బంది

ఎన్ని రోడ్లు వేశారో తెలియదు



మాట్లాడుతున్న ఎంపీపీ వరలక్ష్మి

ఏన్కూరు: మండలంలో నాలుగున్నర సంవత్సరాలుగా ఎన్ని రోడ్లు వేశారో, పంచాయతీ భవనాలు ఎక్కడ కడుతున్నారో తెలియదని ఎంపీపీ అరెం వరలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్లు, పంచాయతీ భవనాల శంకుస్థాపనలు నిర్వహించే టప్పుడు తనకు సమాచారం అందించడం లేదని పంచాయతీ ఏఈ వెంకటేశ్వరరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకో ఆరునెలలైతే తన పదవీ కాలం ముగుస్తుందని.. ఇకనైనా సమాచారం అందించాలన్నారు. ఏఈ వెంకటేశ్వరరావు స్పందించి.. ఇకపై జరిగే అభివృద్ధి పనులకు తప్పక సమాచారం అందిస్తానని తెలపాడు. అనంతరం ఎంపీటీసీ లచ్చిరాం, హిమామ్‌నగర్ సర్పంచ్ శివ, రేపల్లెవాడ సర్పంచ్ విజయభాయి పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని, శ్మశానవాటిక బిల్లులు, పంచాయతీ భవానాల బిల్లులు ఇంకా రావడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బాదావత్ బుజ్జీ, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



బనిగండ్లపాడులో దుస్తులు అందుకున్న వృద్ధులతో సర్పంచ్ పుల్లారెడ్డి, దాత జగదీశ్‌పాల్

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడులోని సుదర్శన్ ఫౌండేషన్ చర్చిలో ఫాదర్ జగదీశ్‌పాల్ బుధవారం దుస్తులు అందించారు. వీటిని బుధవారం స్థానిక సర్పంచ్ జంగా పుల్లారెడ్డి65 మంది వృద్ధులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పేద వృద్ధులకు దుస్తులు అందిచడం చాలా అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు యన్నం పిచ్చిరెడ్డి, రిటైర్డ్ ఏఎస్సై కోదండ రామారావు, వేమిరెడ్డి వెంకటరెడ్డి, బాణాల శ్రీనివాసరావు, బాణాల మోహన్‌రావు, వేమిరెడ్డి రామిరెడ్డి, సంఘస్తులు పాల్గొన్నారు.

చిన్నారులకు దుప్పట్లు, ఆట వస్తువులు..

సత్తుపల్లిరూరల్: గ్రేస్ సర్వీస్ సొసైటీ ఖమ్మం వారి ఆధ్వర్యంలో నిరుపేద చిన్నారులకు దుప్పట్లు, ఆట వస్తువులను బుధవారం గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కమాండెంట్ పి.వెంకటరాములు చేతుల మీదుగా పంపిణీ చేశారు. సత్తుపల్లి మండలం గంగారంలో బి.ఎర్నెస్ట్‌పాల్ ఆధ్వర్యంలో వాళ్ల విజయ్‌కుమార్ సహకారంతో వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో కె.ఏసుబాబు, కె.మల్యాద్రి, మోహన్, సీహెచ్ ప్రభాకర్ పాల్గొన్నారు.



చిన్నారికి దుప్పట్లు, ఆట వస్తువులు అందజేస్తున్న కమాండెంట్ పి.వెంకటరాములు

ప్రమాదకరంగా రోడ్డు అంచులు



ముదిగొండలోని 9వ వార్డులో ప్రమాదకరంగా కనిపిస్తున్న సీసీ రోడ్డు అంచు

ముదిగొండ: ముదిగొండలోని ప్రధాన వల్లబి–ముదిగొండ రోడ్డు అంచున మట్టి కొట్టుకుపోయి ప్రమాదకరంగా ఉంది. ముదిగొండలోని 9వ వార్డులో ప్రధాన రహదారిలో వీధిలోకి వెళ్లాలన్నా, రావాలన్నా ద్విచక్రవాహనాలు పైకి ఎక్కలేకపోతున్నారు. రోడ్డు అంచు బాగానా కోతకు గురికావడంతో ఆ వీధిలో రెండు వైపులా మూలమలుపుల వద్ద కంకర తేలి రోడ్డు ధ్వంసం అయింది. సీసీ రోడ్డు నిర్మాణాలు చేపట్టి మరం తోలడం మరిచారు. దీంతో రాత్రి వేళల్లో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది.

ఎటువంటి ప్రమాదం జరగకముందే పంచాయతీ అధికారులు మరం తోలి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వెలగచెట్టుకు వందల కాయలు

ముదిగొండ: మండలంలోని యడవల్లి గ్రామంలోని శ్రీయోగానందలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో 250ఏళ్ల నాటి వెలగచెట్టుకు వందల్లో వెలగ కాయలు కాశాయి. దేవస్థానం ఆవరణలో ఉన్న ఈ చెట్టుకు కాసే కాయలు ఆకాశన కనిపిస్తున్నాయి. ఆలయంలో రాలిపడే కాయలు తీసుకునేందుకు భక్తులు ఎగబడుతున్నారు. ఆయుర్వేదంలోకి ఎంతో ఉపయోగకరమైన వెలగను అందరూ ఇష్టపడతారు. దీంతో పాటు వెలగకాయతో పచ్చడి పెట్టుకుంటారు. ఎంతో ప్రీతి పాత్రమైన వెలగకాయతో ఎన్నో ఉపయోగాలున్నాయని నిపుణులు చెపుతున్నారు. అలాంటి వెలగచెట్టు ప్రఖ్యాతి గాంచిన దేవాలయంలో వందల సంవత్సరాలగా విరగ కాయడం విశేషమని భక్తులు భావిస్తున్నారు.



యడవల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఏళ్ల నాటి వెలగచెట్టు (ఇన్‌సెట్) వెలగకాయలు